సాక్షి
వికారాబాద్

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



సుద్ద స్వాహా!
సుద్దమట్టి అక్రమ తవ్వకాలకు అడ్డులేకుండా పోయింది. యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి ఓవర్‌లోడ్‌తో కంపెనీలకు తరలిస్తున్నారు. 8లో▸



‘హద్దు’దాటుతున్న డీజిల్
రాష్ట్రంలో చమురు ధరలు ఎక్కువగా ఉండడంతో సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి డీజిల్ అక్రమంగా తరలిస్తున్నారు. 8లో▸



భక్తిశ్రద్ధలతో పెరుగుబసంతం
కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయంలో పెరుగు బసంతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎరన్‌పల్లి శ్రీనివాస్‌కు విద్యారత్న అవార్డు



అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని ఎరన్‌పల్లికి చెందిన శ్రీనివాస్ జాతీయ విద్యారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్ల రాధాకృష్ణ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం మల్లేశ్ చేతుల మీదుగా అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన జాతీయ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతీయేటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డు అందించనున్నట్లు తెలిపారు. మార్చి 12న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పార్టీ నాయకులు

మొయినాబాద్‌రూరల్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో మైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీటీడీ బోర్డు సభ్యుడు కావేరి భాస్కర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవాలయాలతో మన శ్శాంతి, ప్రశాంతత లభిస్తాయన్నారు. అనంతరం సర్పంచ్ మంజుల, మాజీ ఎంపీపీ అనిత శాలువాలు, పూలమాలలతో అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుల్, సురేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జీవంతు, శ్యామ్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తోల్‌కట్ట శ్రీనివాస్, బాకారం రాఘవరెడ్డి, అప్పోజిగూడ రాజు, కేతిరెడ్డిపల్లి శోభ, సుకన్య, గ్రామ నాయకులు శ్రీహరియాదవ్, రవియాదవ్, బిస నర్సింహ, జలల మల్లేశ్, రాఘవేందర్, శ్యామ్‌రావు, కట్టమీది ప్రకాష్, విఘ్నేష్‌గౌడ్, మాల యాదయ్య, నరేష్‌గౌడ్, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

చేవెళ్ల: గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తల్లారం, ఆలూరు గ్రామాల్లో వారు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన కార్యకర్తలు, యువకులు బీజేపీలో చేరారు. అనంతరం పార్టీ నేతలు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ఏకమై.. త్యాగాలు చేసి ప్రత్యేక రాష్ట్రం తీసుకు వస్తే కేసీఆర్ కుటుంబానికి తప్ప ఎవరికీ లబ్ధి చేకూరలేదన్నారు. ప్రాజెక్టుల పేరు చెప్పి వేలకోట్లు వెనకేసుకున్నారని.. వాటిని కాపాడుకోవడానికే బీఆర్‌ఎస్ పెట్టారని ఆరోపించారు. ప్రభుత్వం చెప్పిన మాయమాటలు, ఇచ్చిన హామీలన్నీ ప్రజలకు గుర్తున్నాయని.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు అత్తెల్లి అనంతర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి, చేవెళ్ల బీజేవైఎం అసెంబ్లీ అధ్యక్షుడు అల్లా శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ, దళితమోర్చా అధ్యక్షుడు అశోక్, ఏబీసీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బండారి శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తల్లారం ఆలూరు గ్రామాల బూత్ అధ్యక్షులు కుమార్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

నిధులు వచ్చేనా..
పాలమూరు పారేనా?

రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తే పనులు జోరందుకుంటాయని ఆశిస్తున్నారు. అసెంబ్లీలో సోమవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి అటువైపే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కొలువు దీరాక నాలుగు బడ్జెట్‌లు ప్రవేశ పెట్టగా ప్రస్తుత అసెంబ్లీ పీరియడ్ మరో తొమ్మిది నెలల్లో ముగియనుంది. ఈ అసెంబ్లీకి ఇదే చివరి పద్దు కావటంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

– వికారాబాద్

బడ్జెట్‌పై భారీ ఆశలు
- ఎత్తిపోతలపై ఏళ్లుగా కోతలే
- సీఎం హామీ నీటి మూటలేనా
- కేటాయింపులు లేకుంటే కష్టకాలమే
- చివరి బడ్జెట్‌లోనైనా ఆశలు నెరవేరేనా?
- గత పద్దుల్లోనూ జిల్లాకు ఒరిగింది శూన్యమే



మెతుకు ఆనంద్



పట్నం నరేందర్‌రెడ్డి



కొప్పుల మహేశ్‌రెడ్డి



రోహిత్‌రెడ్డి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కరివెనలో చేపడుతున్న పాలమూరు ఎత్తిపోతల పనులు (ఫైల్)

అసెంబ్లీ కొలువు దీరాక రెండు బడ్జెట్లు కరోనాతో కుదేలవగా మిగతా రెండు బడ్జెట్లలోనూ ఒక్క మెడికల్ కళాశాల కేటాయింపు తప్ప జిల్లాకు పెద్దగా ఒరిగిందేమీలేదు. గడిచిన నాలుగు బడ్జెట్లలో జిల్లాకు చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు, కేటాయింపులు గాని జరగలేదు లేదు. గడిచిన ఎన్నికల హామీల్లో చాలా వరకు అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పైనే జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో నలుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉండగా అధినేత కేసీఆర్‌ను ఒప్పించి జిల్లాకు ప్రత్యేక పద్దు రాబట్టడంలో వారు ఏమేరకు సఫలీకృతులవుతారనేది ఆసక్తికర అంశంగా మారింది. ఇది ఓ రకంగా ఎమ్మెల్యేలకు పరీక్షే అని చెప్పవచ్చు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించిన సీఎం కేసీఆర్ జిల్లా అభివృద్ధి కోసం అనేక వాగ్దానాలు చేశారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గం కోస్గీ పట్టణాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని హామీల వర్షం కురిపించారు. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఓ రోజంతా నియోజకవర్గాల్లో కుర్చీ వేస్కొని కూర్చుంటా.. సమస్యలు అన్ని తెలుసుకుని పరిష్కరించి వెళ్తానని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు హామీ ఇచ్చారు. రెండేళ్లలో పాలమూరు ఎత్తిపోతల పథకంతో నీళ్లు తీసుకు వచ్చి జిల్లా రైతుల కాళ్లు కడుగుతామంటూ వాగ్దానం చేశారు. ఎమ్మెల్యేలు సైతం ప్రతి నియోజకవర్గంలో ఈ హామీనే ప్రధాన హామీగా వాడారు. అయితే వికారాబాద్ కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవానికి తప్ప ఇప్పటి వరకు సీఎం జిల్లాలో ఏ కార్యక్రమానికి హాజరుకాలేదు. హామీలను నెరవేర్చలేదు. దీంతో ఇదే అంశం ఇప్పుడు ప్రతి పక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది. పాలమూరు ఎత్తిపోతలతో పాటు జిల్లాను ఇంకా అనేక సమస్యలు పీడిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమస్య, వికారాబాద్, తాండూరులకు ఔటర్ రింగురోడ్లు, నాలుగు మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేకపోవటం, మున్సిపాలిటల్లో అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు, అనంతగిరి పర్యాటక కేంద్రం అభివృద్ధి లాంటి సమస్యల్లో ఏ ఒక్కటి పరిష్కారానికి నోచుకోలేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పారిశ్రామిక వాడల అభివృద్ధికి నిధులు, కందిబోర్డు ఏర్పాటు, లక్నాపూర్, కోట్‌పల్లి, జుంటుపల్లి, లాంటి ప్రాజెక్టులు ఇతర ప్రధాన చెరువుల కాలువలు మరమ్మతులకు నోచుకోలేదు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పూర్తి కాకపోవటం, మెజార్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవటం వంటి అనేక సమస్యలు జిల్లాను పట్టి పీడిస్తున్నాయి.

ఎమ్మెల్యేలకు పరీక్షే..

ఈ బడ్జెట్ జిల్లా ఎమ్మెల్యేలకు పరీక్షే.. గెలిచాక నాలుగేళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధి నిధులు రాకపోగా పనులు ముందుకు సాగడంలేదు. సీఎం కేసీఆర్ ఇస్తానన్న నియోజకవర్గానికి రూ. 10 కోట్లు ఇంకా రాలేదు. తాండూరులో రూ. వందల కోట్ల తెచ్చానంటూ ప్రొసిడింగులతో హంగామా చేసిన ఎమ్మెల్యే ఇంకా ఏ ఒక్క చోట పనులు ప్రారంభించలేదు. వికారాబాద్‌లో వందల కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే కేటీఆర్ బృందంతో హడావుడి చేయగా అవి ఇప్పుడు బడ్జెట్ కార్యరూపం దాల్చాలని వేచి చూస్తున్నారు. చివరి బడ్జెట్‌లోనైనా నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యేలు సఫలమవుతారా? లేదా అనేదానిపై చర్చ జరుగుతోంది. ఈ పరీక్షలో ఎమ్మెల్యేలు పాసైతే తలెత్తుకుని వారి ఓటర్ల దగ్గరకు వెళతారు.. లేదంటే వారికి ఓట్లేసి గెలిపించి అసెంబ్లీకి పంపిన జిల్లా ఓటర్లకు ఏం సమాధానం చెబుతారోమరి.

ధూపదీపాలు ఎలా?

- ఎవరికీ పట్టని అర్చకుల అవస్థలు
- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- ప్రస్తుత బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరిగేనా?

కొడంగల్: జిల్లాలో ధూప దీప నైవేద్య అర్చకులకు ఆదరణ కరువైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పురాతన ఆలయాల్లో అర్చకులను నియమించింది. దేవునికి ధూపం దీపం సమర్పించాలనే ఉద్దేశంతో అర్చక స్వాములను నియమించింది. అయితే వారికి ప్రతి నెలా చెల్లించాల్సిన వేతనాలను సకాలంలో చెల్లించడం లేదు. నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో అర్చకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాల్లో దేవుని నిత్య పూజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా ధూప దీప నైవేద్యానికి నిధులు కేటాయించాలని అర్చక స్వాములు కోరుతున్నారు.

ఆలయాలకు ఆర్థిక ఇబ్బందులు

మిగులు బడ్జెట్‌తో ధనిక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణాలో ఆర్థిక సంకటం నెలకొంది. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదని దీప ధూప నైవేద్య సంఘం అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5వేల మందికి పైగా అర్చకులు దీప ధూప నైవేద్య సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వారికి నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. ప్రతి నెలా రెండు వేల రూపాయలు దేవుని పూజ, అలంకరణ, నైవేద్యానికి, నాలుగు వేలు అర్చకునికి గౌరవ వేతనంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రతి నెలా వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో అర్చకులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.



కొడంగల్ గాడిబాయి శివాలయం

దేవుని సేవకు అంతరాయం ఉండకూడదని అర్చకులు ఆపసోపాలు పడుతున్నారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఏ ఇబ్బంది లేకుండా గౌరవంగా వేతనాలు చెల్లించేవారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత వేతనాలు పెంచి కొందరిని అర్చకులుగా నియమించి జీవనోపాధి కల్పించారు. అయితే వారికి ప్రతి నెలా చెల్లించాల్సిన డబ్బుల విషయంలో మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 అక్టోబర్‌లో కొత్తగా అర్చకుల నియామకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 51 మందిని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 350 మంది, రాష్ట్ర వ్యాప్తంగా 5వేలకు పైగా అర్చకుల నియామకం జరిగింది. వారికి ప్రతి నెలా రూ.6 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్నాళ్లు దీప ధూప నైవేద్యాలకు నోచుకోని ప్రాచీన ఆలయాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి ఊపిరి పోశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అర్చకులకు నెల నెలా వేతనాలు అందించాల్సి ఉంది. అయితే కొంత కాలంగా సకాలంలో వేతనాలు రావడం లేదని ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

“ నిధులు కేటాయించాలి



ప్రాచీన ఆలయాలకు పునర్జీవం కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ నెలకు రూ.ఆరు వేలు ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5వేలకు పైగా అర్చకుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. అయితే నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం సకాలంలో గౌరవ వేతనాలు చెల్లించి అర్చకులను ఆదుకోవాలి. ప్రస్తుత బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలి. ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ఆటంకం లేకుండా చూడాలి.

– జయతీర్థచారి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రాజెక్టు నీటిలోకి యువత

కోట్‌పల్లిలో కొరవడిన నిఘా

ధారూరు: యువకులు ఆదివారం దర్జాగా కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో దిగి ఈత కొట్టారు. వారెవ్వరికీ ఈత రాకున్నా నడుము లోతు నీటిలోకి వెళ్లి ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి నిఘా లేకపోవడంతో సందర్శకులు ప్రాజెక్టు నీటిలోకి వెళుతున్నారు. గత నెల 16న కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో నలుగురు మునిగి మృతి చెందిన విషయం విదితమే. అప్పటి నుంచి పర్యాటకులను ప్రాజెక్టు వద్దకు అనుమతి ఇవ్వడంలేదు. రెండు మూడు రోజులుగా నిఘా లేకపోవడంతో సందర్శకుల కదలికలు మొదలయ్యాయి. శని, ఆదివారాల్లో పోలీసు కాపలా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్



మాట్లాడుతున్న ధర్మానాయక్

అనంతగిరి: సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రెండో జిల్లా మహాసభ వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల సాధనకు గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఆయన కోరారు. దళిత బంధు మాదిరిగా గిరిజన బంధు పథకం అమలు చేసి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గిరిజన నేతలు మాణిక్, మెగావత్ వెంకట్రాములు, శ్రీనివాసులు, మహేశ్, రాందాస్, లక్ష్మణ్, శాంతి పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

గిరిజన జిల్లా సంఘం అధ్యక్షుడిగా జె. శ్రీనివాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం. వెంకట్రాంనాయక్, ఉపాధ్యక్షులుగా వి. లక్ష్మణ్, కె. మహేశ్‌లు, సహాయ కార్యదర్శిగా మాణిక్, సభ్యులు మరో 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు ఓయూ బంద్

ఉస్మానియాయూనివర్సిటీ: పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నిబంధనల పేరుతో వీసీ ప్రొ.రవిందర్ వ్యవహరిస్తున్న మొండివైఖరికి నిరసనగా సోమవారం ఓయూ బంద్ నిర్వహించనున్నట్లు ఐక్య విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం పేర్కొన్నారు. క్యాంపస్‌లోని కాలేజీలు, కార్యాలయాల బంద్‌కు సహకరించాలని కోరారు.



చంద్రగిరిలో స్వామి వారి కల్యాణం

కనులపండువగా రథోత్సవం

- తరలివచ్చిన భక్తజనం
- గోవిందనామస్మరణతో మార్మోగిన చంద్రగిరి

తాండూరు పట్టణ శివారులోని చంద్రగిరి(దస్తగిరిపేట్)లో వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయ రథోత్సాలు అత్యంత వైభవంగా జరిగాయి. గత నెల 28న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం పౌర్ణమి సందర్భంగా దేవాలయంలో కొలువైన స్వామి వారికి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా అంతారం, తాండూరు పట్టణం, పెద్దేముల్ మండలం నుంచి వేలాది మంది భక్తులు హాజరై ఉత్సవాలను తిలకించారు.

– తాండూరు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లింగం మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పేదల కష్టాలను విస్మరించి స్వలాభమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ కులాల లెక్కింపు చేపట్టాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పునః సమీక్షించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేదలను చేర్చాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, రాజ్యాధికారంకోసం బహుజన సమాజ్ పార్టీ అనేక పోరాటాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

మూణ్నాళ్లకే మూత!

- నష్టాల ఊబిలో మహిళా సమాఖ్య సూపర్ మార్కెట్
- నిర్వహణలోపం, పర్యవేక్షణ కొరవడటమే కారణం
- నిండా ముంచారని సమాఖ్య సంఘాల సభ్యుల మండిపాటు



దోమలో మూతపడ్డ సూపర్ మార్కెట్

దోమ: గ్రామీణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సంఘాలతో కలిపి ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ మూణ్నాళ్లకే మూత పడింది. మహిళా సంఘాల్లోని సభ్యుల ఉపాధి కోసం రూ.లక్షలు వెచ్చించి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే స్థానిక అధికారుల నిర్లక్ష్యం, జిల్లా అధికారుల పర్యవేక్షణలోపంతో నష్టాల ఊబిలో కూరుకుపోయింది.

రూ.10 లక్షలతో ఏర్పాటు..

మహిళా సంఘాల సభ్యుల ఉపాధి కోసం దోమ మండల కేంద్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద రూ.10 లక్షలతో 2021 జూలై 16న సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 48 గ్రామ సంఘాలు ఉండగా ఇందులో ఒక్కో మహిళా సమాఖ్య నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4.80 లక్షలు ఖర్చు పెట్టారు. మిగిలిన రూ.5.20 లక్షలను మండల మహిళా సమాఖ్య నుంచి వెచ్చించారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, అప్పటి కలెక్టర్ పౌసుమి బసు, ప్రస్తుత డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్ చేతుల మీదుగా సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. కానీ గతంలో ఇక్కడ పని చేసిన ఏపీఎం, ప్రస్తుతం పని చేస్తున్న సీసీలు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో సూపర్ మార్కెట్ నష్టాల ఊబిలోకి వెళ్లిందనే ఆరోపణలున్నాయి. దీని నిర్వహణ కోసం తెచ్చిన ర్యాక్‌లు, వస్తువుల విషయంలో నాణ్యత పాటించకపోవడం, కొటేషన్లలోనూ రూ.2 లక్షల వరకు కాజేశారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు.

మహిళా సభ్యుల ధనం వృథా

రెక్కల కష్టంతో పైసాపైసా కూడబెట్టి.. ఉపాధి మార్గం ఎంచుకున్న తమను అధికారులు, మండల మహిళా సమాఖ్య సభ్యులు నిండా ముంచారని వివిధ గ్రామాలకు చెందిన సభ్యులు మండిపడుతున్నారు. సూపర్ మార్కెట్ ఏర్పాటు కోసం ప్రతీ గ్రామం నుంచి రూ.10 వేలు వసూలు చేశారని చెబుతున్నారు. నాణ్యత లేని సరుకులు విక్రయించడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ డబ్బులు వృథా అయ్యాయని మండిపడుతున్నారు. ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

“ నష్టాల్లోకి రావడంతో మూసేశాం

రూ.10 లక్షలతో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశాం. రూ.6 లక్షలతో సరుకులు, ర్యాక్స్ తెచ్చి మిగతా రూ.4 లక్షలు మండల మహిళా సమాఖ్య అకౌంట్‌లో జమ చేశాం. వ్యాపారం జరగకపోవడంతో నష్టాలు వచ్చాయి. దీంతో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తీర్మానం చేసి మార్కెట్‌ను మూసేశాం. గ్రామ సంఘాల నుంచి రూ.10 వేల చొప్పున తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఏపీఎం, దోమ

క్లుప్తంగా

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ధ్వజ స్తంభానికి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: మండల పరిధిలోని ఖాజా అహ్మద్ పల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, సంజీవరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుద్ద గుంతలో పడి వ్యక్తి మృతి



వెంకటప్ప మృతదేహం

పెద్దేముల్: సుద్ద గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన బోయిని వెంకటప్ప(36) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న మద్యం తాగిన ఆయన రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆరా తీయగా మద్యంతాగి మారేపల్లి గ్రామ శివారులోని ఓ సుద్ద గుంతలో స్నానానికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులు సుద్ద గుంతల్లో పరిశీలించగా ఆయన మట్టిలో ఇరుక్కుని మృతిచెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వారంలో మూడు చోరీలు

నందిగామ: మండలంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల్లో రెండు చోట్ల దొంగతనాలు జరగ్గా తాజాగా శనివారం మండల కేంద్రంలో మరో దొంగతనం చోటుచేసుకుంది. నందిగామకు చెందిన ఓ వ్యక్తి తన బైక్‌ను శనివారం చౌరస్తాలో పార్క్ చేసి పని నిమిత్తం వేరే చోటుకి ఇత రుల వాహనంపై వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా తన బైక్ కనపడక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. దీంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేవలం వారం రోజుల వ్యవధిలో మూడు చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పెట్రోలింగ్ సిబ్బందిని పెంచడమే కాకుండా దొంగలను పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక శక్తికి తోడు ఆరోగ్య శక్తి అవసరం

శంషాబాద్ రూరల్: 'ఆరోగ్యవంతమైన దేశం వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది..ప్రతి ఒక్కరికి ఆర్థిక శక్తితో పాటు ఆరోగ్యశక్తి కూడా అవసరం' అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారతి ట్రస్టు ఆవరణలో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం మన జీవన శైలిలో మార్పులు, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు ఎంతో ముఖ్యమన్నారు. యోగా, నడక, వ్యాయామంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. రైతులు, యువత, మహిళల అభ్యున్నతికి సేవా దృక్పథంతో స్వర్ణ భారత్ ట్రస్టు చేపడుతున్న కార్యక్రమాలు అద్భుతమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమానికి ముందు ఆవరణలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

సుద్ద స్వాహా!

సుద్దమట్టి అక్రమ తవ్వకాలకు అడ్డులేకుండా పోయింది. రాత్రీపగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి ఓవర్‌లోడ్‌తో కంపెనీలకు తరలిస్తున్నారు. అధికారుల అండదండలతోనే తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- రాయల్టీ లేకుండానే తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్(ఫైల్)

పెద్దేముల్: ఓవర్‌లోడ్ ప్రమాదమని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. పగలు హిటాచీలతో అక్రమంగా సుద్ద తవ్వకాలు చేపట్టి రాత్రిళ్లు ఓవర్‌లోడ్‌తో ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రతీ సంవత్సరం సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారే లేరని ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలో మూడేళ్లుగా మైన్స్, రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమ సుద్ద తవ్వకాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. డిసెంబర్, జనవరిలో అధికారులు పట్టించుకోరని కొంత మంది అక్రమార్కులు బహిరంగంగానే తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయాన్ని పలు గ్రామాల ప్రజలు మైన్స్, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా.. ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ వదిలేస్తున్నారు. 20రోజుల క్రితం తవ్వకాలు చేపట్టినా ఇప్పటికీ ఒక్క అధికారి తనిఖీలు చేపట్టిన దాఖాలాలు లేవు. గతేడాది రుద్రారం, గోపాల్‌పూర్ గ్రామాల ప్రజలు అక్రమ సుద్ద తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదులు చేశారు. పది రోజుల క్రితం మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంత బహిరంగంగా సుద్ద తవ్వకాలు చేపట్టినా మైన్స్ అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతేడాది సుద్ద యజమానులు అధికారుల పేరుతో గనికి రూ.40వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇదే అదునుగా ఫ్యాక్టరీల యజమానులు వేయి టన్నులకు రాయల్టీలు చెల్లించి సుమారు 5వేల టన్నుల వరకు అక్రమంగా తరలించి నిల్వ చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

తాడిపత్రుల చాటున తరలింపు

ఓవర్ లోడ్ వాహణాలకు సైడ్ ఇచ్చే సమయంలో సుద్ద పెడ్డలు ప్రయాణికులపై పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో ప్రమాదాలు సైతం జరిగాయి. ఈ విషయమై గతంలో మైన్స్, రెవెన్యూ, పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో తాడిపత్రులు వేసుకుని సుద్ద తరలించారు. కానీ గత ఏడాదిగా మళ్లీ ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. గనుల నుంచి సుద్దను ఫ్యాక్టరీలకు తరలించే ముందు గనుల శాఖ(మైన్స్)నుండి రాయల్టీలు తీసుకుని సుద్దను తరలించాలి. కానీ ఇందుకు విరుద్ధంగా తరలిస్తున్నారు. కొంత మంది గనుల యజమానులు బినామీ రాయల్టీతో సుద్దను తరలించట్లు సమాచారం. మరికొంత మంది ఒక ప్రాంతం సుద్దను మరో ప్రాంతం రాయల్టీ పెట్టి తరలించడం మామూలైంది. ఈ విషయాన్ని మైన్స్ అధికారులకు తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపనలు వినబడుతున్నాయి. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే నామమాత్రపు తనిఖీలు చేసి వదిలేస్తున్నారని విమర్శిస్తున్నారు. సుద్ద ఫ్యాక్టరీల యజమానులు రాయల్టీ లేని గనుల ద్వారా తక్కువ ధరకు సుద్దను విక్రయాలు చేసుకొని తరువాత రాయల్టీను సంపాదిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓవర్ లోడ్ సుద్ద టిప్పర్‌లను నిలపివేయాలని మంబాపూర్, పెద్దేముల్ తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

"చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ అనుమతి లేకుండా సుద్దను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతీ టిప్పర్‌కు తప్పకుండా రాయల్టీ ఉండాలి. రాయల్టీ లేకుండా ప్రభుత్వ అనుమతి లేని సుద్ద గనుల ద్వారా సుద్దను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఓవర్ లోడ్‌తో టిప్పర్‌లు గ్రామాల నుంచి ప్రయాణిస్తే సర్పంచ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. అవసరం అయితే టిప్పర్‌లను నిలిపి వేయవచ్చు.

– సాంబశివరావు, ఏడీ మైన్స్, తాండూరు డివిజన్

ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు



అభిమానుల మధ్య కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఘనంగా మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పరిగి: పట్టణ కేంద్రంలోని ఎస్‌గార్డెన్‌లో ఆదివారం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా ఎమ్మెల్యే ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే నియోజకవర్గ పర్యటనకు వస్తుండగా మన్నెగూడ నుంచి అభిమానులు భారీ కాన్వాయ్‌తో స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన నివాసంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. కొడంగల్ చౌరస్తాలో అభిమానులు గజమాలతో సత్కరించారు. ఆయా మండలాల నా యకులు ఎమ్మెల్యేను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి
- శివస్వాముల ఆశ్రమానికి రూ.10లక్షల విరాళం

తాండూరు టౌన్: పాత తాండూరులోని కోటేశ్వర దేవస్థానంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వచ్చే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ శివస్వాముల ఆశ్రమ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందజేసి భూమి పూజ చేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, కౌన్సిలర్ రవిరాజ్, స్టేషన్ హనుమాన్ ఆలయ చైర్మన్ సంజీవరావు, బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, సిద్రాల శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్, శ్రీధర్, గుండప్ప పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వైస్ చైర్‌పర్సన్ దీప

నైపుణ్యాలను వెలికితీసేందుకే క్రీడాపోటీలు

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



ఎస్‌కేఆర్ ట్రస్టు అందజేసిన క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న సునీతారెడ్డి తదితరులు

మర్పల్లి: క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకే క్రీడాపోటీలు నిర్వహిస్తారని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పట్లూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌కేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీటీసీ సభ్యురాలు స్వప్నాసురేశ్ ప్రారంభించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ననగారి కొండల్‌రెడ్డితో కలిసి సునీతారెడ్డి పోటీలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభ వెలికితీయవచ్చునన్నారు. కొండల్‌రెడ్డి స్వంత ఖర్చుతో ప్రతీ సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. మండలాభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించినట్లు ఆమె గుర్తు చేశారు. త్వరలోనే మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17న మండల కేంద్రంలో ట్రస్టు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని చెప్పారు. పాల్గొనదలిచిన క్రీడాకారులు ఈ నెల 15వరకు టీం పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని సునీతారెడ్డి అన్నారు. పట్లూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలను తిలకించిన అనంతరం ఆమె తన స్వంత డబ్బులు వెచ్చించి తీసుకువచ్చిన జ్యూట్ బ్యాగులను క్రీడాకారులకు, రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని సూచించారు. క్రీడాకారుల కోసం ఎస్‌కేఆర్ ట్రస్టు తయారు చేయించిన దుస్తులను జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు పలువురు నాయకులు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని నర్సపూర్ తండా సర్పంచ్ ధరమ్‌సింగ్ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె వెంట మర్పల్లి సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఫసియొద్దీన్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామేశ్వర్, ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ రవీందర్‌నాయక్, బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మర్పల్లి మాజీ వైస్ ఎంపీపీ అంజయ్యగౌడ్, సర్పంచ్‌లు సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, హన్మంత్ రెడ్డి, పాండురంగారెడ్డి, యాదవరెడ్డి, సురేశ్, మంగలి రమేశ్, వెంకట్‌రెడ్డి, వెంకట్, కృష్ణారెడ్డి పలు గ్రామాల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హద్దుదాటుతున్న డీజిల్

- కర్ణాటక నుంచి పటాన్‌చెరుకు తరలింపు
- నిబంధనలు బేఖాతరు
- మూడు వాహనాలు సీజ్



పట్టుబడిన వాహనాలు

బంట్వారం: రాష్ట్రంలో చమురు ధరలు ఎక్కువగా ఉండడంతో సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి డీజిల్ అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల బంట్వారం వద్ద చేపట్టిన తనఖీల్లో మూడు వాహనాలు పట్టుబడ్డాయి.

లీటర్‌కు రూ.10 వ్యత్యాసం

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన కొందరు ఫ్యాక్టరీ యజమానులు కర్ణాటకలోని చించోళి, కుంచారం ప్రాంతాల నుంచి డీజిల్ తరలిస్తున్నారు. ట్యాంకర్లు, డీసీఎం వ్యాన్లలోనే వేలాది లీటర్లు తరలిస్తున్నారు. లీటరు డీజిల్‌కు రూ.10 వ్యత్యాసం ఉండడంతో ట్యాంకర్లు పెట్టి తీసుకువెళ్తున్నారు. ఈ అక్రమదందా చాలా రోజులుగా కొసాగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు.

"కలెక్టర్‌కు నివేదించాం

పోలీసుల సమాచారంతో బంట్వారం గ్రామానికి వెళ్లి విచారించాం. రెండు ట్యాంకర్లు, ఒక డీసీఎం వ్యానులో 8వేల లీటర్లకు పైగా డీజిల్ ఉన్నట్లు గుర్తించాం. మూడు వాహనాలను సీజ్ చేసి పోలీసులకు పిర్యాదు చేశాం. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. తదుపరి చర్యలు తప్పక ఉంటాయి.

– రాజేశ్వర్, డీఎస్ఓ

ముగ్గురిపై కేసు..

సివిల్ సప్‌లై అధికారుల ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేశాం. సంగారెడ్డి, పటాన్‌చెరువు ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలకు కర్ణాటక నుంచి డీజిల్ తరలిస్తుంటే మూడు వాహనాలను పట్టుకున్నాం. వెంటనే సవిల్ సప్‌లై అధికారులకు సమాచారం ఇచ్చాం. వారి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశాం. సివిల్ సప్‌లై అధికారులు జరిమానా విధిస్తారు.

– ఆనంద్‌కుమార్, ఎస్‌ఐ

శోభాయమానంగా రథోత్సవం



వేంకటేశ్వర స్వామివారి రథం లాగుతున్న భక్తులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ గ్రామంలో ఆదివారం వేంకటేశ్వర స్వామివారి రథోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణమోహన్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగయ్య, గ్రామస్తులు నర్సింహారెడ్డి, నడిమింటి శివకుమార్, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో కొత్త చెరువు..!

పూడ్చేందుకు యత్నిస్తున్న రియల్టర్లు
- ఆక్రమణలు గుర్తించకుండా చెరువు చుట్టూ మట్టి పోత
- రెవెన్యూ శాఖకు గ్రామస్తుల ఫిర్యాదు
- పూర్తిస్థాయి విచారణ చేస్తామంటున్న అధికారులు



సిరిగిరిపురం కొత్త చెరువు



మట్టి పోయడంతో కుచించుకుపోయిన కొత్త చెరువు

మహేశ్వరం: హైదరాబాద్, అంతర్జాతీయ విమానాశ్రయానికి, ఔటర్ రింగ్ రోడ్డుకు అతి చేరువలో ఉన్న మహేశ్వరంలో భూములకు రెక్కలొచ్చాయి. దీన్నీ ఆసరాగా చేసుకొని కొంత మంది రియల్టర్లు కనిపించిన స్థలాలను కబ్జా చేస్తున్నారు. వారి అవసరాల కోసం ఏళ్లనాటి చెరువును కబ్జా చేసి మట్టితో పూడ్చి వెంచర్ ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఇదెక్కడో కాదు.. మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలోని కొత్త చెరువును రియల్ వ్యాపారులు ఆక్రమించి దాన్ని మట్టితో పూడ్చేందుకు యత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇది వరకు ఇక్కడ కొత్త చెరువు ఉండేదని, దాన్ని కబ్జా చేయరాదని వారితో వారించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగరానికి చెందిన కొందరు చెరువు పక్కన ఉన్న పట్టా భూమిని కొనుగోలు చేసి చెరువుతో పాటు వారి భూమి చుట్టూ సుమారు 12 అడుగుల ఎత్తు మట్టి పోసి చెరువు లోపల జరిగే పనులు బయట వారికి కనిపించకుండా సిమెంట్ ప్రీ కాస్ట్ నిర్మాణం చేశారు. దీంతో చెరువులో ఎలాంటి పనులు చేపట్టినా బయటి వారికి కనిపించవు. రియల్టర్లు చెరువు అలుగును కూల్చేసి రోడ్డు వేశారు. భారీ వర్షాలు కురిస్తే మహేశ్వరం నుంచి వరద నీరు సిరిగిరిపురంలోని కొత్త చెరువులోకి వస్తాయి. ఇక్కడి నుంచి మంఖాల్ చెరువులోకి, అక్కడి నుంచి రావిర్యాల పెద్ద చెరువులోకి నీరు చేరుతుంది. కొత్త చెరువు నిండితే సమీపంలోని వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలకు కొదవ ఉండదు. సిరిగిరిపురంలో కొత్త చెరువు ఉందో లేదో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించి చెరువు కబ్జాకు గురైతే కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అడ్డంకులు తొలగాలని పాదయాత్ర

- బాలాజీని దర్శించుకున్న చిన్నమంగళారం వాసులు
- వంతెన పనులు ప్రారంభం కావాలని వేడుకోలు



సుందరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న చిన్నమంగళారం ప్రజలు

మొయినాబాద్: కోర్టు కేసులతో నిలిచిపోయిన వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవాలని చిన్నమంగళారం గ్రామస్తులు చిలుకూరు బాలాజీ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అడ్డంకులు తొలగి త్వరగా వంతెన నిర్మాణ పనులు మొదలు కావాలని స్వామివారిని వేడుకున్నారు. మండలంలోని చిన్నమంగళారం వద్ద మూసీ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసింది. కొంత కాలం క్రితం పనులు మొదలయ్యాయి. తమ భూమిలో వంతెన నిర్మాణం చేయవద్దని ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. కోర్టు వివాదం, ఇతర అడ్డంకులు తొలగిపోయి వంతెన నిర్మాణ పనులు మొదలు కావాలని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మరికొంత మంది గ్రామస్తులు ఆదివారం చిన్నమంగళారం నుంచి చిలుకూరు బాలాజీ దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. అడ్డంకులు తొలగిపోయి, పనులు త్వరగా మొదలయ్యేలా చూడాలని స్వామివారికి పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేశారు. పాదయాత్ర చేసిన వారిలో యువకులు శ్రీనివాస్‌గౌడ్, రజినీకాంత్‌రెడ్డి, శ్రీరామ్, వెంకటేష్, రాములు, గణేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1744]

WANTED

త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్స్ కమీషన్. 3K Ph: 7569955551, 9848571888 [H-786830]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.